అస్తవ్యస్తంగా యూజీడీ

- 17,18 డివిజన్లలో నిత్యం పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్
- రాణిగారితోటలో నానా అవస్థలు పడుతున్న స్థానికులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక రాణి గారితోట ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ప్రాంతంలోని 17, 18 డివిజన్లలో ఏ వీధిలో చూసినా పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్ దర్శనమిస్తున్నాయి. నిత్యం మ్యాన్‌హోల్స్ నుంచి వ్యర్థాలతో కూడిన మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 17వ డివిజన్‌లోని బాపనయ్య నగర్ మెయిన్ రోడ్డు, ఉల్లిపాయల కొట్టు రోడ్డు, మస్జీద్ రోడ్డు, గుడ్ మార్నింగ్ టీ స్టాల్ రోడ్డు, పాల సంగయ్య వీధి, పుట్టరోడ్డు రెండో వీధి, గ్రంథాలయం రోడ్డు, 18వ డివిజన్‌లోని మాదంశెట్టి సీతయ్య వీధి, కోరె నామయ్య వీధి, మాదాల వెంకటేశ్వరరావు వీధి, ఆంటోని వీధి, సంగూల పేరయ్య వీధి, కనకదుర్గగుడి రోడ్డు, బాలస్వామి వీధి తదితర వీధుల్లో మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లడం నిత్యకృత్యంగా మారింది. గత 5 నెలలుగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో మ్యాన్‌హోల్స్ పొంగుతూ మలంతో కూడిన మురుగునీరు ఇళ్ల ముందు ప్రవహిస్తుండడంతో ఆ వైపుగా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. మ్యాన్‌హోల్స్ పొంగి ఆ మురుగునీరు ఇళ్ల ముందు ఉన్న సైడు కాలువలోకి ప్రవహిస్తోంది. ఆ నీరు తమ ఇంటి ముందుకు ఎక్కడ వస్తుందోనని పక్కింటి వాళ్లు కాలువలను పూడ్చివేస్తున్నారు. కొన్ని చోట్ల ఇంటి యజమానులు తమ ఇంటి ముందు వీఎంసీ నిర్మించిన సైడు కాలువలను పూడ్చివేసి పక్కింటి వైపు నుంచి మురుగునీరు రాకుండా ఎత్తులో కాలువను నిర్మించుకుంటున్నారు. దీంతో ఇరుగు పొరుగు వారికి తరచూ గొడవలు జరుగుతున్నాయి. మురుగునీటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పోతున్నామని, దోమలు వృద్ధి చెంది దాడి చేస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ దుర్వాసనతో ఇంట్లో సరిగ్గా భోజనం కూడా చేయలేకపోతున్నామని వాపోతున్నారు. పలుమార్లు వీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే ఎయిర్‌టెక్ మిషన్‌తో వచ్చి శుభ్రం చేస్తున్నారని, మరలా రెండు రోజుల తర్వాత యథావిధిగా మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి యూజీడీ మ్యాన్‌హోల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఆంటోని వీధిలో పొంగుతున్న యూజీడీ మ్యాన్‌హోల్


బాపనయ్యనగర్ మెయిన్ రోడ్డులో మ్యాన్‌హోల్ దుస్థితి

పట్టించుకోని అధికార పార్టీ నాయకులు

అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పుకుంటున్న టీడీపీ నాయకులకు నిత్యం పొంగుతున్న మ్యాన్‌హోల్స్ కనిపించడంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏదో ఒక వీధిలో మ్యాన్‌హోల్ పొంగితే అక్కడకు వెళ్లి తమ ఉనికి కోసం నిరసన తెలిపిన 18వ డివిజన్ టీడీపీ నాయకులకు గత 5 నెలలుగా డివిజన్‌లోని పలు వీధుల్లో మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నా కనిపించకపోవడం గమనార్హం. యూజీడీ పొంగుతుండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని డివిజన్ టీడీపీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినా పొంతనలేని సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సమస్యను కనీసం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేయడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి తమ గోడు విని మురుగు కంపు నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం



రాణిగారితోట ప్రాంతంలో నిత్యం మ్యాన్‌హోల్స్ పొంగడం పరిపాటిగా మారింది. మ్యాన్‌హోల్స్ నుంచి వ్యర్థాలతో కూడిన మురుగునీరు రోడ్ల పైకి వస్తోంది. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే నరకం చూస్తున్నాం. మురుగు నుంచి వచ్చే దుర్గంధం భరించలేకపోతున్నాం. గత 5నెలలుగా ఇదే పరిస్థితి. వీఎంసీ సిబ్బంది స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

–పి.చెన్నారెడ్డి, రాణిగారితోట

ఎస్‌ఎన్ పురం రైల్వే రిజర్వేషన్ కౌంటర్ మధురానగర్‌కు తరలింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికులకు సౌకర్యవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు సత్యనారాయణపురంలోని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్(పీఎస్ఆర్)కౌంటర్‌ను ఈ నెల 24 నుంచి మధురానగర్ స్టేషన్‌కు మార్చనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కొత్తగా మార్చిన మధురానగర్ స్టేషన్‌లోని పీఎస్ఆర్ కౌంటర్ నుంచి టికెట్ రిజర్వేషన్‌లు, క్యాన్సిలేషన్‌లు, అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) టికెట్‌ల జారీ సేవలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ కౌంటర్ సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, తిరిగి 2.15 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు, ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తెరచి ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి మధురానగర్ స్టేషన్ నుంచి ఆయా సేవలు పొందాల్సిందిగా అధికారులు కోరారు.

పెదపులిపాకలో వక్ఫ్ భూముల సర్వే

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న వక్ఫ్ భూములను బుధవారం సర్వే చేశారు. గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 87లో 12.59 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 93లో 9.63 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. అధికారులు సర్వే చేసిన అనంతరం పొలం హద్దులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండీ నూహుఆలీషా, వీఆర్వో జీవా, విలేజ్ సర్వేయర్ శ్రీనివాస్, ఖాజీ ఎండీ హబీబుల్లాహసన్, వక్ఫ్ సర్వేయర్ షేక్.ఆశిక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సుబ్బరాయనగర్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సిటీ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బరాయనగర్, పోలీస్ రామయ్య వీధి, వల్లూరివారి వీధి, పచ్చమేడ బజార్, గుంటూరు వారి వీధి, రామకృష్ణవీధి, ఆర్చి రోడ్డు పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం



పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకోవటంలో విఫలమయిందని సీపీఎం విజయవాడ తూర్పు నగర కమిటీ సభ్యులు పి.వరప్రసాద్, వీబీ రాజు అన్నారు. బుధవారం పటమట 9వ డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ రోడ్డులో వీరిరువురూ స్థానిక సమస్యల్ని ప్రతి ఇంటికీ తిరిగి అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా డ్రైనేజీ పొంగుతోందని, దోమల బెడద అధికంగా ఉందని, దీన్ని పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా వరప్రసాద్, వీబీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల విభాగంలో సీ-పాప్, ఫొటో థెరపీ యూనిట్లు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి పిల్లల విభాగంలోని నవజాత శిశువులకు వైద్యం అందించడంలో దోహదపడే సీ-పాప్‌లు, ఫొటో థెరపీ యూనిట్‌లను బుధవారం సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. వాటితో పాటు నియోకూలెంట్ పరికరాలను సమకూర్చారు. ఇవి నవజాత శిశువులకు వైద్యం అందించడంలో ఎంతో ఉపయోగపడతాయని పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కథానిక పోటీల్లో చాముండేశ్వరి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యావికాస వాహిని సంస్థ ఈ నెల 12న కంకిపాడులో నిర్వహించిన తెలుగు కథానిక పోటీల్లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని ఎల్‌వీఎస్ చాముండేశ్వరి సత్తా చాటింది. ఆ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి నగదు బహుమతిని పొందినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా చాముండేశ్వరిని బుధవారం ప్రిన్సిపాల్‌తో పాటు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ప్రాంగణ ఇంటర్వ్యూల్లో 18 మంది ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో బుధవారం ముత్తూట్ ఫిన్‌కార్ప్ నిర్వహించిన ప్రాంగణ ఇంటర్వ్యూల్లో 18 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 110 మంది హాజరు కాగా, గ్రూప్ డిస్కషన్, ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలతో పాటు, ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించగా 18 మంది ఉద్యోగార్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ప్రిన్సిపాల్ అనురాధ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు నిర్మించరూ!

- బీటీ రోడ్డు వేశాక వేగంగా దూసుకెళ్తున్న వాహనాలు
- భయాందోళన చెందుతున్న స్థానికులు
- ఇదీ.. రామలింగేశ్వరనగర్ కరకట్ట వాసుల పరిస్థితి

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధులతో ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం బీటీ రహదారి నిర్మించింది. ఎన్నో నెలలుగా స్థానికులు అధికారులకు విన్నవించుకోగా గత కొన్ని రోజుల క్రితం రామలింగేశ్వరనగర్ కరకట్ట రోడ్డు వేశారు. గతంలో ఈ రోడ్డు ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలు ఉండేవి. బీటీ రోడ్డు వేసిన తర్వాత మరో సమస్య తలెత్తింది. నిత్యం అరచేతిలో ప్రాణం పెట్టుకొని రోడ్డును దాటాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ఈ రహదారి గుండా అవనిగడ్డకు నిత్యం వాహనాలు వస్తూపోతుంటాయి. అసలే రోడ్డు ఇరుకుగా ఉంటుంది. దీనికి ఇరువైపులా షాపులు ఉంటాయి. ఎవరికి వారు రహదారిని సైతం ఆక్రమించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హద్దు.. ఆపు లేకుండా కొత్త కొత్తగా షాపులను నిర్మిస్తున్నారు. అడిగేవారు లేకపోవడం.. నిర్మాణాలను అదుపు చేసే వారు కరువయ్యారు. దీంతో యథేచ్ఛగా ఆక్రమణలు జరిగిపోతున్నాయి.


రామలింగేశ్వర నగర్‌లో వేగంగా వెళుతున్న వాహనాలు

వేగ నిరోధకాలు లేవు...

బీటీ రోడ్డు వేయడం వల్ల వాహనాల స్పీడ్‌కు కళ్లెం లేకుండా పోయింది. కార్లు, ద్విచక్రవాహనాలు దూసుకుపోతున్నాయి. దివంగత వంగవీటి రంగా పార్కు నుంచి యనమలకుదురు కొండ మలుపు వరకు పాఠశాలలు, రెండు మసీదులతో పాటు చర్చిలు కూడా ఉన్నాయి. ఇటు వారు అటు, అటు వారు ఇటు రావాలంటే అరచేతిలో ప్రాణం పెట్టుకుని రావాల్సి వస్తోందని కరకట్ట ప్రజలు వాపోతున్నారు. వారం క్రితం ఒక బాలుడు వాహనం కింద పడ్డాడని, స్థానికుల సహకారంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వేగనిరోధకాలను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు దాటాలంటే భయమేస్తోంది

రోడ్డు వేసిన అధికారులు వేగనిరోధకాలు వేయడం మరిచిపోయారు. దీని వల్ల రోడ్డు దాటాలంటే భయమేస్తోంది. వృద్ధులు, పిల్లలతో ఇబ్బందికరంగా ఉంది. వాహనాల స్పీడ్‌ను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వరరావు, స్థానికుడు

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వెలికితీయాలి


పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వెలికితీయాలని నగర ప్రముఖుడు డాక్టర్ ఎంసీ దాస్ అన్నారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం రోటరీ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టర్ పట్టాభి రామయ్య మాట్లాడుతూ రోటరీ, రోటరాక్ట్ అనుసంధానంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని, పేరెంట్ క్లబ్ నుంచి తగిన సహకారాలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం పలువురు విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. రోటరాక్ట్ నూతన క్లబ్‌కి ఆటోమా ఆఫ్ ఆదిత్య, కారుణ్య ఆఫ్ ఆదిత్య లోగోలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణ రెడ్డి, రొటేరియన్ డాక్టర్ దేవి, చార్టర్ క్లబ్స్ ఆటోమా ప్రెసిడెంటు అభిషేక్, కారుణ్య క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లలిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వీరరాజు సీడీఆర్సీ రవి, డీఆర్ఆర్ హర్షిత, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సుంకర ఫణీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ పాల్గొన్నారు.


విద్యార్థినికి జ్ఞాపికను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం షెడ్యూల్ ఏరియాలో స్థానిక ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర డిమాండ్ చేశారు. అరకు ఎన్నికల సభలో సీఎం చంద్రబాబు జీవో నంబర్-3 చట్టబద్ధతపై ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కె.చిన్నంనాయుడు అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో జీఓ నంబర్-3 చట్టం వలన 19 డిపార్టుమెంట్లలో 34 రకాల ఉద్యోగ నియామకాలు స్థానిక ఆదివాసులకు హక్కుగా ఉండేవని, దానిని సుప్రీంకోర్టు 2020 మార్చిలో రద్దు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని నాడు అరకు ఎన్నికల సభలో నేటి సీఎం చంద్రబాబు ప్రకటించి ఆరు నెలలు గడిచినా జీఓ-3 చట్టబద్ధతకు అతీగతీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీతో పాటు ఆదివాసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత చేసి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభాకర్, అప్పల నర్సయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర



ఇదేదో చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన చిత్రం అనుకుంటున్నారు కదూ... ప్రకృతి కాన్వాసుపై సూర్యభగవానుడు చిత్రించిన సహజ సౌందర్య చిత్ర రాజం... సాయం సంధ్య వేళ అరుణ కిరణాలతో ఆకాశంతో పాటు కృష్ణవేణీ నదీ జలాలు కూడా అరుణారుణవర్ణంతో మెరిసిపోతుంటే...తమ జీవన భృతి కోసం ఉదయమే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరుగుముఖం పట్టిన దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో అందంగా బంధించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

25న నూతన ఓటర్ల నమోదు


జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై మాట్లాడుతున్న డీటీ రవీంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పలు విద్యాసంస్థల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దారు రవీంద్ర తెలిపారు. బుధవారం తూర్పు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చైతన్య ఆదేశాల మేరకు తాము సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారుల సమావేశం నిర్వహించామని చెప్పారు.

ఈ సమావేశంలో తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆంధ్ర లయోలా కాలేజీ, పీబీ సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాల, మారిస్ స్టెల్లా కాలేజీ, ఎన్ఎస్ఎం స్కూల్, ఏపీఎస్ఆర్ఎం హైస్కూళ్లలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించామన్నారు. ఆ సందర్భంగా నూతన ఓటర్లుగా నమోదైన యువత, 80 ఏళ్లు పైబడిన సీనియర్ ఓటర్లకు సత్కారం, ఓటరు నమోదు, ఓటు హక్కులపై ర్యాలీలు, రంగవల్లిలు, ప్రతిజ్ఞలు చేయించాలని నిర్దేశించామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, విజయవాడ ఆర్డీఓ, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, వీఎంసీ అడిషనల్ కమిషనర్, అన్ని గుర్తింపు పొందిన ప్రభుత్వ-ప్రైవేటు విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, హెడ్ మాస్టర్లు పాల్గొంటారని తెలిపారు.

చిత్ర పరిశ్రమకు అక్కినేని సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు అందించిన అక్కినేని నాగేశ్వరరావు చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. అత్యుత్తమ నటుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో గల అక్కినేని విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు బి.వసంత కుమార్ మాట్లాడుతూ 90 ఏళ్ల జీవిత కాలంలో 75 సంవత్సరాల పాటు సినిమాలలో నటించిన అక్కినేని నాగేశ్వరరావు వంటి వ్యక్తి దేశంలో మరొకరు లేరని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడంలో అక్కినేని కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అక్కినేని వ్యక్తిగతంగా నాస్తికుడు అయినప్పటికీ ఎన్నో భక్తిరస సినిమాలలో అద్భుతంగా నటించి రక్తి కట్టించారన్నారు. అక్కినేని విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన శిల్ప కళారత్న దేవికారాణి శిల్ప కళా నైపుణ్యం ప్రశంసనీయమన్నారు. ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ అక్కినేనితో తనకున్న పరిచయాన్ని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, అక్కినేని అభిమానులు డాక్టర్ నాగమల్లిక, బోడి ఆంజనేయరాజు, స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్, ప్రభల శ్రీనివాస్, ఎంవీ కృష్ణారావు, పీవీఎల్ఎన్ రాజు, ఎస్‌కే షఫీఉల్లా, ఆలిండియా అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షుడు ఎన్.సర్వేశ్వరరావు, చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొని అక్కినేనికి నివాళులు అర్పించారు.


అక్కినేని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు, అభిమానులు

హమ్మయ్య... గుంతను పూడ్చారు


నాడు : ప్రమాదకరంగా ఉన్న గుంత


నేడు : గుంతను పూడ్చిన దృశ్యం

సాక్షి స్పందన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మధుచౌక్ నుంచి కిలారు బుచ్చిబాబు వీధిలోకి వెళ్లే రోడ్డు మొదట్లో ప్రమాదకరంగా ఉన్న గుంతను ఎట్టకేలకు కార్పొరేషన్ సిబ్బంది మరమ్మతులు చేసి పూడ్చారు. నిత్యం వాహనదారులు, పాదచారుల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో సరిగ్గా రోడ్డు మధ్యలో గుంత ఏర్పడింది. మురుగునీటి కాలువపై నిర్మించిన కల్వర్టులోని సిమెంట్ రాళ్ల మధ్య ఖాళీ ఏర్పడింది. దీనివల్ల ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికంగా ఉండే వ్యాపారులు ఈ గుంత దగ్గర ఇటుక రాళ్లను అడ్డుగా పెట్టారు. వీటిపై వాహనాలు వెళ్లడంతో అవి పగిలిపోయాయి. ఈ విషయాన్ని వివరిస్తూ ఈ నెల 20వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ''మధుచౌక్‌లో జరభద్రం'' శీర్షికతో కథనం ప్రచురించాం. స్పందించిన కార్పొరేషన్ సిబ్బంది గుంత దగ్గర మరమ్మతులు చేశారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన 'సాక్షి' పత్రికకు, స్పందించి వెంటనే మరమ్మతులు చేసిన కార్పొరేషన్ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సప్తస్వర సమ్మేళనం గాత్ర యుగళం

విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పడమట దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న సంగీత సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో విష్ణుభొట్ల సోదరీమణులు కృష్ణవేణి, సరస్వతి నిర్వహించిన గాత్రయుగళం అలరించింది. త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, మృదంగంపై బీవీఎస్ ప్రకాష్, ఘటంపై కానూరి వెంకటరామకృష్ణ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ సంస్థ నిర్వాహకుడు యనమండ్ర శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ గురువారంతో సంగీత ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. మారెళ్ళ కీర్తిచంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో హంసధ్వని చారిటబుల్ సంస్థ సభ్యులు రామశాస్త్రి, గోపీకృష్ణ శర్మ, రామకృష్ణ పాల్గొన్నారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో త్యాగరాజ స్వామికి పూజలు నిర్వహించారు.



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే!

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయవాడ తూర్పు నియోజకవర్గ అనుబంధ విభాగాలకు బాధ్యులను నియమించారు. మరీదు దినేష్ (యూత్ వింగ్), పుప్పాల నరసకుమారి (మహిళా విభాగం), చెన్నుబోయిన బాలరాజు (బీసీ సెల్), కలపాల అంబేడ్కర్ (ఎస్సీ సెల్); మేడా పవన్ ఆనంద్ (ఎస్టీ సెల్), షేక్ సుభాని (మైనార్టీ సెల్), సొంగా సుధీర్ వర్మ (క్రిస్టియన్ మైనార్టీ సెల్), అడపా చందు (విద్యార్థి విభాగం), మెరకనపల్లి కుటుంబరావు (మున్సిపల్ వింగ్), మల్లెల చెన్నారెడ్డి (ఆర్టీఐ వింగ్), వి నాగార్జునరెడ్డి (వలంటీర్ వింగ్), రజనీ సుధాకర్ (గ్రీవెన్స్ సెల్), ఎండీ గౌస్ (వాణిజ్య విభాగం), ఎం.రఘురామ వర్మ (వీవర్స్ వింగ్), మరీదు ఉమ (వైఎస్సార్‌టీయూసీ), ఎం.జయలక్ష్మి (అంగన్‌వాడీ వింగ్), యక్కంటి పుల్లారెడ్డి(లీగల్ సెల్), చెన్నా వెంకట దుర్గా ప్రసాద్ (కల్చరల్ వింగ్), యజ్జల లక్ష్మీ సాయికుమార్ (సోషల్ మీడియా వింగ్), వల్లూరుపల్లి హరీష్ చక్రవర్తి (ఐటీ వింగ్), పెద్ది దుర్గా ప్రసాద్ (దివ్యాంగుల విభాగం), మార్కపూడి చారియోరా (డాక్టర్స్ వింగ్), పెయ్యేల అలంకార్ బాబు (పబ్లిసిటీ వింగ్), ధనేకుల రామకోటేశ్వరరావు (ఇంటిలెక్చువల్ ఫోరం), మాగంటి నవీన్‌కుమార్ (బూత్ కమిటీస్ వింగ్) అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది.